క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. వోల్వో ఫీడర్ పరిధిలోని సాయిఅనురాగ్ కాలనీ, కావ్య ఎవెన్యూలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...

- వికాస్ ఫీడర్ పరిధిలోని వికాస్ పబ్లిక్ స్కూల్ ఏరియా, సూర్య స్కూల్, ఎస్ఆర్ఐ స్కూల్, విష్ణుకృపా డెవలపర్స్, టెక్నో పోలీస్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం సూరారం కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో 22 మందికి కరోనా పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్ట్‌లు వచ్చినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. కరోనా లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని దవాఖానాల్లో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

మీ-సేవ నిర్వాహకులతో అత్యవసర సమావేశం



మీసేవ నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణలో భాగంగా 59 జీవో విషయమై కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు మంగళవారం మీసేవ నిర్వాహకులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల 59 జీవో కింద డిమాండ్ నోటీసులు అందుకున్న లబ్ధిదారులకు మీసేవ ద్వారా జనరేట్ చేయించుకుని అనంతరం బ్యాంకుకు చలానా ద్వారా రుసుము చెల్లించాలన్నారు. ఈ విషయమై లబ్ధిదారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీసేవ నిర్వాహకులపై ఉందన్నారు.

'వడ్డెర కులస్తులకు అండగా ఉంటా'



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మహేష్

సుభాష్‌నగర్: ఆర్థికంగా వెనుకబడిన వడ్డెర కులస్తులకు అండగా ఉంటానని మేడ్చల్ జిల్లా వడ్డెర యువజన సంఘం అధ్యక్షుడు మహేష్ అన్నారు. కాప్రా మండలం జవహర్‌నగర్‌లోని బీజేఆర్‌నగర్‌లో ఇటీవల పీతల శ్రీదేవి రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. విషయం తెలుసుకున్న మహేష్ సోమవారం రాత్రి గాజులరామారంలో శ్రీదేవి తల్లి వెంకటమ్మకు రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. విజయ్ ముదిరాజ్, చిన్న, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వనిత డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

చింతల్: చింతల్ వనిత డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే మంగళవారం బాల్‌రెడ్డినగర్‌లోని సురేందర్ రెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండెంట్ డా. నరేష్ మాట్లాడుతూ... తమ కళాశాల విద్యార్థులకు ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ మౌనిక, డైరెక్టర్లు కావ్య, హరికృష్ణ, ప్రిన్సిపల్ రాజయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. మంగళవారం టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కేఎం ప్రతాప్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఠాగూర్ విజయేందర్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రతాప్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెద్ది మల్లేశం, రత్నం, మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధం వాటర్‌ట్యాంక్ ప్రాంతం

మూగజీవాలకు ఆవాసం.. ఆకతాయిలకు అడ్డా





చెత్తాచెదారం, వీధికుక్కలతో వాటర్ ట్యాంక్ పరిసరాలు



ఎల్లమ్మబండలో ప్రధాన తాగునీటి ట్యాంక్

ఆల్విన్‌కాలనీ: శుచి, శుభ్రతతో కూడిన తాగునీటి జలాలను ప్రజలందరికి అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి సుదూర ప్రాంతం నుంచి తాగునీటిని నగరానికి రప్పించి.. మంచినీరు అందించాలన్న లక్ష్యంతో కూకట్‌పల్లి సర్కిల్ ఎల్లమ్మబండలో నూతనంగా ప్రధాన వాటర్‌ట్యాంక్‌ను నిర్మించారు. కానీ వాటర్ ట్యాంక్ నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో ట్యాంక్ పరిసరాలు దుర్గంధంగా మారాయి. చెత్తాచెదారం పేరుకుపోయి ఈగలు, దోమలు, వీధి కుక్కలు, పందులు, మూగజీవాలకు ఆవాసంగా మారింది.

నిర్వహణ శూన్యం..

ఎల్లమ్మబండలో నిర్మించిన వాటర్‌ట్యాంక్ ద్వారా కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలలోని ఇళ్లకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ట్యాంక్ ద్వారు 365 రోజులు 24 గంటలకు తాగునీటిని విడతల వారీగా సరఫరా చేస్తుంటారు. తరచూ సిబ్బంది ట్యాంక్‌ను పరిశీలిస్తుండాలి. కానీ వాటర్ ట్యాంక్ గేటుకు ఎప్పుడూ తాళం వేసి ఉంటుంది. ఇదే అదునుగా భావించిన పోకిరీలు ఈ ప్రాంతాన్ని అడ్డాగా మార్చుకున్నారు. దీని అంతటి కారణం ఒక వాచ్‌మెన్‌ను నియమించకపోవడమేనని స్థానికులు పేర్కొంటున్నారు.

నీటి శుభ్రతను పరీక్షించిన దాఖలాలు లేవు..

- గతంలో మూగజీవాల కళేబరాలు, వ్యర్థాలకు కూడా ఈ ట్యాంక్‌లో కనిపించాయి. నీటి సరఫరాలో వెంట్రుకలు సైతం రావడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. అప్పటి నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు, తాళం వేసుకొని మాయం అయిపోయారు. సంబంధిత ఉన్నతాధికారులు ఈ ట్యాంక్ శుభ్రతను గానీ నీటి సాంద్రతను గానీ పరీక్షించిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. ప్రతి రోజు నీటి శుభ్రత, సాంద్రతను రాసి రిజిస్టర్‌ను మెయింటెన్ చేయాల్సి ఉంటుంది. కానీ అక్కడ అలాంటి పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటున్నారు. ప్రజలకు అందించే తాగునీరు స్వచ్ఛమైనదా? కాదా అనే అయోమయంలో పరిసర ప్రాంతవాసులు ఉన్నారు.

శుభ్రమైన నీటిని అందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలి..

- గతంలో వాటర్ ట్యాంక్‌లో మూగజీవాల కళేబరాలు, వెంట్రుకలు రావటంతో పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ప్రజాప్రతినిధులు ఆఘమేఘాల మీద ఆ ప్రాంతానికి చేరుకొని పరిశీలించి అధికారులతో చర్చించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు అటువంటి చర్యలు తీసుకున్న పాపాన పోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాటర్ ట్యాంక్‌ను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ట్యాంక్ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు శుభ్రమైన నీటిని అందించి ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు.

వివేకానందనగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



వివేకానందనగర్ డివిజన్‌లో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరికాలనీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్-1, శుభోదయ కాలనీ, ఏఎస్‌రాజు నగర్‌లలో కోటి 13 లక్షల 90వేల రూపాయల అంచనా వ్యయంతో సీసీరోడ్డు పనులను చేపట్టనున్నారు. మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవితో కలిసి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

- అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. వివేకానందనగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ సీసీరోడ్ల నిర్మాణం పనులకు.. వరదనీటి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాలనీల్లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించడమే ధ్యేయంగా సీసీ రోడ్ల నిర్మాణపనులకు శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. అన్ని కాలనీ, బస్తీల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు.
- అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని.. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగ గారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పెద్ద భాస్కర్ రావు, చంద్రకాంత్‌రావు, సతీష్‌రావు, కార్తీక్ రావు, హరినాథ్, రాంచందర్, ఆంజనేయులు, మహేష్, చంద్రమోహన్‌సాగర్, మోహన్‌రావు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్, రెక్టార్ పోస్టులను తెలంగాణ ప్రొఫెసర్లకే ఇవ్వాలి



ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో రిజిస్ట్రార్, రెక్టార్ పోస్టులు తెలంగాణ ప్రొఫెసర్లకే ఇవ్వాలని జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు ఎరవెల్లి జగన్, లకవాత్ భానుప్రకాష్ నాయక్‌లు మాట్లాడారు.

- యూనివర్సిటీలో జరుగుతున్న పరిణామాలు గురించి, సీనియర్ ప్రొఫెసర్స్, ప్రొఫెసర్లకు జరుగుతున్న అన్యాయం గురించి, యూనివర్సిటీలో 13 డైరెక్టర్లు ఉంటే అందులో 9 డైరెక్టర్లు నాన్ తెలంగాణ వారికి ఇచ్చామన్నారు. యూనివర్సిటీ కాలేజీలో 7 ప్రిన్సిపాల్ పోస్టులు ఉంటే అందులో 4 నాన్ తెలంగాణ వారికి ఇచ్చారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రొఫెసర్లకు ఆంధ్రప్రదేశ్‌లో అవకాశాలు వస్తున్నాయని, డైరెక్టర్లు, అడ్మినిస్ట్రేటివ్ పోస్టులలో తెలంగాణ, నాన్ తెలంగాణ ప్రొఫెసర్లందరికి సమన్యాయం చేయాలని కోరారు.
- యూనివర్సిటీ రెక్టార్‌గా నాన్ తెలంగాణ ప్రొఫెసర్లకు ఇవ్వాలని ప్రతిపాదన చేశామన్నారు. ఈ విషయాలను ప్రాణాళికా సంఘం వైస్ చైర్మన్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించి అందరికీ సమన్యాయం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

పేదలకు భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వారికి మంజూరైన రూ.5.44లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటోందని పేర్కొన్నారు. ఆర్థిక స్తోమత లేక ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ఈ పథకం భరోసా ఇస్తోందని తెలిపారు. వివేకానందనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయికులు చంద్రకాంత్‌రావు, చంద్రారెడ్డి, కాశీనాథ్‌యాదవ్, ఆంజనేయులు, చంద్రమోహన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి



రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం దళిత ఐక్యవేదిక మహిళా సంఘం వారి ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీషాబాబురావు రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక సంఘం అధ్యక్షుడు బోడ నర్సింగరావు, జనరల్ సెక్రటరీ ఎడ్ల సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల కవిత, జనరల్ సెక్రటరీ లలిత, బండి సుధ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లిం శ్మశానవాటిక పనులు త్వరగా పూర్తిచేస్తాం



ఎల్లమ్మబండలో శ్మశానవాటిక పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలోని ముస్లిం శ్మశానవాటికలో రూ.1.5కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ప్రస్తుతం ముస్లిం శ్మశానవాటిక ముఖద్వారం, ప్రార్థన హాలు నిర్మాణ దశలో ఉన్నాయని కార్పొరేటర్ తెలిపారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అలాగే సుందరీకరణ పనులన్నీ నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, షౌకత్ ఆలీ మున్నా, వాసుదేవరావు, పెద్ద ఖాజా, యాదగిరి, ఖాజా, మీసాల జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌బీలో 'ఫ్యూచర్ ఆఫ్ ఫ్యామిలీ బిజినెస్' సదస్సు



మాట్లాడుతున్న సంజీవ్ బజాజ్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లోని థామస్ ష్మిదేని సెంటర్ ఫర్ ఫ్యామిలీ ఎంటర్‌ప్రైజ్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ బిజినెస్‌పై 8వ ఆసియా ఇన్విటేషనల్ సదస్సును 'ఫ్యూచర్ ఆఫ్ ఫ్యామిలీ బిజినెస్' అనే అంశంపై నిర్వహించారు. 28 మంది ప్రముఖ కుటుంబ వ్యాపార నాయకులు, నిపుణులు తమ అనుభవాలను, సలహాలను సదస్సులో ప్రతినిధులతో పంచుకున్నారు. ప్రధానంగా భారతదేశంతోపాటు శ్రీలంక, నేపాల్ నుంచి వచ్చిన కుటుంబ వ్యాపార సంఘం సభ్యులు సదస్సులో వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కుటుంబ వ్యాపారంలో తదుపరి తరం, నాయకత్వం, పాలనలో మహిళలు, కుటుంబ సంపదను రక్షించడం, వృద్ధి చేయడం,సంక్షోభంలో వ్యాపారాన్ని నిర్వహించడం వంటి అంశాలు పరిగణనలోకి వచ్చాయి. దివంగత రాహుల్‌బజాజ్ అసాధారణ జీవితాన్ని సెలబ్రేట్ చేసేందుకు ఆయన కుమారుడు,బజాజ్ ఫిన్ సర్వ్ లిమిటెడ్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ అధ్యక్షులు సంజీవ్ బజాజ్ , ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ బోర్డు సభ్యులు ,రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ అజిత్‌రంగ్నేకర్ తో సంభాషించారు. కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన గచ్చిబౌలి క్రీడాకారులు

గచ్చిబౌలి: గచ్చిబౌలికి చెందిన క్రీడాకారులు వారణాసిలో జరిగిన సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఇంటర్ స్కూల్ క్రీడలలో రాణించారు. 2022-23 పోటీలలో గచ్చిబౌలి స్టేడియంలో 1500 మీటర్ల పరుగు పందెంలో 17 ఏళ్ల విభాగంలో మిథిని ప్రథమస్థానం..14 ఏళ్ళ విభాగంలో ప్రీతికరెడ్డి, 800 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానం పొందారు. జాతీయ స్థాయి క్రీడలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గచ్చిబౌలి స్టేడియం కోచ్ శ్రీనివాస్ అభినందించారు.

కాలనీల సమగ్రాభివృద్ధే లక్ష్యం

శేరిలింగంపల్లి: కాలనీల సమగ్రాభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తున్నామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. గోపీనగర్, నెహ్రూనగర్‌లో ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ, సీసీరోడ్ల, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జలమండలి మేనేజర్ అభిషేక్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మోహన్, అధికారులు బ్రహ్మం, నవీన్, జగన్‌మోహన్, నాయకులు యాదగౌడ్ , పర్వీన్‌బేగం ,దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గెలాక్సీ ఎస్23 మొబైల్ ప్రీ బుకింగ్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని నోవాటెల్‌లో ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సాంగ్ గెలాక్సీ ఎస్ 23 సిరీస్ ప్రీ బుకింగ్‌ను సామ్‌సంగ్ ఇండియా మొబైల్ బిజినెస్ జనరల్ మేనేజర్ అక్షయ్‌గుప్తా మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గెలాక్సీ ఎస్23 సిరీస్ 24 గంటలలో 1,40,000 ప్రీ బుకింగ్స్‌తో రికార్డు సాధించిందన్నారు. అత్యంత వేగవంతమైన మొబైల్ గ్రాఫిక్స్ గెలాక్సీ అందించడానికి ఎస్23 సిరీస్ కస్టమ్ డిజైన్ చేయబడ్డ 8 జెన్2 అని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మొబైల్‌పై ప్రత్యేక ఆఫర్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు.

కేపీహెచ్‌బీ డివిజన్ అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించారు. వసంత్‌నగర్‌లోని యూజీడీ పైపులైన్, వరదనీటి డ్రెయిన్ పనులు, భగత్‌సింగ్‌నగర్‌లో అభివృద్ధి పనులు, 6వ ఫేజులో నూతనంగా నిర్మిస్తున్న ఫుట్‌పాత్ పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా 9వ ఫేజులో మహిళా మండలి పార్కులోని ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలించారు. త్వరలో అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్నామని పేర్కొన్నారు. డివిజన్‌లోని ఖాళీ స్థలాల్లో ప్రజలకు ఉపయోగపడే క్రీడా మైదానాలు, పార్కులు కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ సాయి ప్రసాద్, కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు


టీపీసీసీ సభ్యుడు డా.సత్యం శ్రీరంగం




బాలానగర్‌లో జరిగిన హాత్‌సే హాత్ జోడో యాత్రలో సత్యం శ్రీరంగం

బాలానగర్: హాత్‌సే హాత్ జోడో యాత్రను మంగళవారం బాలానగర్‌లోని సాయినగర్, నవజీవన్‌నగర్, వినాయక్‌నగర్, గీతనగర్ సెయింట్ మార్టిన్ స్కూలు నుంచి టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం చేపట్టారు. రాహుల్ గాంధీ సందేశాలను.. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేసే కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. భారత్ జోడో యాత్ర ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు తెలియజేస్తూ ముందుకెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన సంక్షేమాన్ని వివరిస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి చేస్తామని హామీ ఇస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏ-బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, మధుమోహన్, నవీన్‌గౌడ్, మల్లేష్, యాదగిరి, క్రిష్ణారాజ్‌పుత్, మధుగౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు సేవలపై డీఎంహెచ్‌వో ఆరా



కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ 4వ ఫేజులోని మల్టీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ సందర్శించారు. అక్కడ జరుగుతున్న కంటి పరీక్షల తీరు పరిశీలించారు. కంటివెలుగు కేంద్రంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. పరీక్షలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందర్, సీనియర్ నర్సు రమాదేవి, ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్, కూకట్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు పిడికిటి గోపాల్‌చౌదరి, భవాని, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటివెలుగు రెండో దశ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహా తీసుకోవాలన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలతో పాటు కంటి శస్త్రచికిత్సలు కూడా చేస్తారని తెలిపారు. కంటివెలుగు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

కంటివెలుగు సిబ్బంది పనితీరుపై హర్షం

బాలానగర్: బాలానగర్ మండల కేంద్రంలోని కంటివెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి మంగళవారం స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంతమంది పరీక్షలు చేయించుకున్నారనే వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటివెలుగు కేంద్రంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అక్కడికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. సిబ్బంది పనితీరుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

- ఈ శిబిరంలో ఇప్పటి వరకు 1704 మంది పరీక్షలకు నమోదు చేసుకున్నారని అందులో పురుషులు 780 కాగా, మహిళలు 924 మంది ఉన్నారన్నారు. అందులో 697 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. సుమారు 413 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలు అందించాల్సి ఉందని పేర్కొన్నారు. అవసరం ఉన్న వారికి 15 నుంచి 20 రోజుల్లో వాటిని వారి ఇంటికే వచ్చి ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
- ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నీరజ్, డీఓ నమ్రత, సూపర్‌వైజర్ ప్రేమ సుందరి, ఏఎన్ఎం పద్మ, మంజుల, ఆశావర్కర్ వినోద, కనమ్మ, జీహెచ్ఎంసీ సిబ్బందితో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు మందడి సుధాకర్‌రెడ్డి, ఎంఎస్ కుమార్, నాగేష్, నాగేందర్‌గౌడ్, యాదగిరి, రామేశ్వర్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.